జాతీయ వార్తను
ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.
కామ్‌లో కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రిక ద్వారా ప్రచురించి మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com www.jatheeyavaartha.com

బుధవారం | 10-9-2025 | శ్రీకాకుళం | సంపుటి: 2 సంచిక: 450 పేజీలు: 4 వెల : రూ.7




* రైతులతో కలిసి వైసీపీ శ్రేణుల భారీ ర్యాలీ
* అధికారులకు వినతిపత్రాలు అందజేత
* వైసీపీ నేతలు పోరుబాటలో పాల్గొనకుండా అరెస్టులు, గృహనిర్బంధాలు
* అయిననూ లెక్కచేయకుండా పాల్గొన్న శ్రేణులు
* ఎరువు ఇవ్వలేని అసమర్థ ప్రభుత్వమంటూ ఎక్కడికక్కడ వైసీపీ శ్రేణుల బైఠాయింపులు, నినాదాలు
* కదం తొక్కిన రైతన్నలు

# పోరుబాట.. సక్సెస్

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 9 (వార్త):** రైతుల సమస్యలపై వైసీపీ నేతలు మంగళవారం చేపట్టిన పోరుబాట సక్సెస్ అయింది. వైసీపీ శ్రేణులతో పాటు రైతన్నలు ఈ పోరుబాట ర్యాలీలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. వైసీపీ నేతలు ఎవరూ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనకుండా పోలీసులు ముందస్తుగా అరెస్టులు, గృహ నిర్బంధాలు చేశారు. అయినప్పటికీ నేతలు కించిత్ భయపడకుండా ముందుకే సాగారు. అన్ని మండల కేంద్రాలతో పాటు టెక్కలి, నరసన్నపేట, పలాస నియోజక వర్గ కేంద్రాల్లో భారీ ర్యాలీ చేశారు. వైసీపీ శ్రేణులతో పాటు రైతన్న పెద్ద ఎత్తున కదం తొక్కారు. కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వైఎస్ విగ్రహాలకు క్షీరాభిషేకం చేశారు. అనంతరం ర్యాలీగా వెళ్లి అధికారులకు వినతిపత్రాలు అందజేశారు.

## నరసన్నపేటలో కదం తొక్కిన వైసీపీ శ్రేణులు, రైతన్నలు..

**నరసన్నపేట/జలుమూరు:** నరసన్నపేట పట్టణంలోని ప్రధాన రహదారి మంగళ వారం వైసీపీ నేతలు, రైతన్నలతో కిక్కిరిసిపోయింది. స్థానిక వైసీపీ కార్యాలయం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య, వైఎస్ఆర్సిపి శ్రేణులు, రైతులతో కలిసి భారీ ర్యాలీ చేశారు. తహశీల్దార్ కార్యాలయానికి చేరుకుని వినతిపత్రం సమర్పించారు. ర్యాలీకి అనుమతి లేదంటూ పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. కానీ నిరసనకారులు వాటిని లెక్క చేయకుండా, గట్టి నినాదాలతో తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా ధర్మాన కృష్ణ చైతన్య మాట్లాడుతూ.. రైతులకు ఎరువులు ఇవ్వలేని స్థితిలో కూటమి ప్రభుత్వం ఉండడం దారుణమన్నారు. పంటలు పండించుకునే స్థితి లేక రైతులు కష్టాల్లో కూరుకుపోతున్నారన్నారు. శాంతి యుతంగా ర్యాలీ చేస్తుంటే అడ్డుకోవడం అన్యాయమన్నారు. రైతులకు అన్యాయం చేస్తున్న దగా ప్రభుత్వమని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నాయకులు, రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## మంత్రి ఇలాఖాలో వైసీపీ భారీ ర్యాలీ



**టెక్కలి:** రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు సొంత నియోజకవర్గ కేంద్రమైన టెక్కలిలో వైసీపీ శ్రేణులు, అన్నదాతలు భారీ ర్యాలీ చేశారు. పోరుబాట కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. యూరియా బ్లాక్ మార్కెట్‌ను అరికట్టి రైతులకి తక్షణమే అందజేయాలని కోరుతూ వైసీపీ టెక్కలి నియోజకవర్గం ఇంచార్జ్ పేరాడ తిలక్ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, పార్లమెంట్ నియోజకవర్గ పరిశీలకులు కుంభా రవిబాబు, పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి మంగళవారం టెక్కలి ఆర్డీవోకు వినతి పత్రం అందజేశారు. కూటమి ప్రభుత్వం ఎరువులు సకాలంలో రైతులకు అందజేయడం లేదని, దీంతో యూరియా బస్తాను అధిక ధరకు వెచ్చించి రైతులు కొనరగోలు చేస్తున్నారని వాపోయారు. ఎరువులను తెలుగుదేశం నాయకులు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తూ రైతాంగానికి తీవ్ర అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఎరువులను ఆర్బికేల ద్వారా సరఫరా చేయడంతో రైతులకు సకాలంలో ఎరువులు అందేవని ప్రస్తుతం దళారీ వ్యవస్థతో చంద్రబాబు రైతాంగాన్ని నట్టేట ముంచారని ఆరోపించారు. ఈ కార్యక్రమం లో వైఎస్ఆర్సిపి నాయకులు శ్యాంప్రసాద్ రెడ్డి, దువ్వాడ వాణి, నాయకులు పాల్గొన్నారు.

### పేరాడ తిలక్ ను అడ్డుకున్న పోలీసులు

వైసీపీ టెక్కలి నియోజకవర్గం ఇంచార్జ్ పేరాడ తిలక్ ఆధ్వర్యంలో మంగళవారం టెక్కలి లో జరిగిన అన్నదాత పోరు కార్యక్రమం పోలీసుల అడ్డగింతలు, నాయకుల గృహనిర్భందాలు, వైఎస్ఆర్సీపీ శ్రేణుల నిరసనలు మధ్య జరిగింది. టెక్కలిలో అన్న దాత పోరు కార్యక్రమం రైతు ర్యాలీ నిర్వహించకుండా ఒడేందుకు టెక్కలి డీఎస్పీ ఆధ్వర్యంలో పోలీసులు శతవిధాల ప్రయత్నించారు. తిలక్ వ్యూహాత్మకంగా వ్యవ హరించి ముందుగానే టెక్కలి చేరుకున్నారు. టెక్కలిలోని ప్రైవేట్ కల్యాణ మండపం నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు ర్యాలీగా వెళ్లేందుకు తిలక్ బయలుదేరగా పోలీసులు చుట్టుముట్టారు. దీనిని ప్రతిఘటించిన తిలక్ పార్టీ శ్రేణులతో ర్యాలీగా వెళ్లేందుకు ప్రయత్నించగా టెక్కలి డిఎస్పి ఆధ్వర్యంలోని పోలీసుల బృందం నిలువరించారు. వైసీపీ నాయకులు, కార్యకర్తలను పోలీసు వాహనాల్లో ఎక్కించి నౌపడ, కోటబొమ్మాళి, సంతబొమ్మాళి, టెక్కలి పోలీస్ స్టేషన్‌లకు తరలించారు. అప్పటికే టెక్కలి వందలాదిమంది రైతులు వైఎస్ ఆర్సిపి శ్రేణులు చేరుకోవడంతో వీరిని అడ్డగించడం పోలీసులు వల్ల కాలేదు. చివరకు ఆర్డీవోకి వినతిపత్రం అందజేసేందుకు అనుమతించాలని ఇవ్వాలని తిలక్ కోరగా పోలీసులు ర్యాలీ నిర్వహించేందుకు అనుమతి ఇవ్వకుండా తిలక్‌ను పోలీస్ వాహనంలో తీసుకుని ఆర్డిఓ కార్యాలయానికి తరలించారు. విషయం తెలుసుకున్న వందలాదిమంది వైఎస్ఆర్సిపి నాయకులు రైతులు ర్యాలీలుగా ఆర్డిఓ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు, చంద్రబాబు , అచ్చన్నాయుడుకు వ్యతిరేకంగా వైఎస్ఆర్సిపి నాయకులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో టెక్కలి నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాలకు చెందిన వైసీపీ నేతలు, వివిధ అనుబంధ విభాగాల నాయకులు ఎంపీపీలు, జడ్పిటిసి సభ్యులు సర్పంచులు ఎంపిటీసీలు కార్యకర్తలు రైతులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.





## పోలీస్ నిర్బంధాలను అధిగమించి.. కదం తొక్కిన ఉద్దానం రైతులు

**పలాస:** పోలీసుల నిర్బంధాలు, ఆంక్షలు నడుమ పలాసలో పోరుబాట సాగింది. ముందుగా మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. అయినప్పటికీ ఉద్దానం రైతులు పోలీసుల నిర్బంధాలు అధిగమించి సీదిరి ఇంటికి పెద్ద ఎత్తున చేరుకున్నారు. ర్యాలీకి అనుమతి ఇవ్వకపోవడంతో పోలీసులు, వైసీపీ శ్రేణుల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. రైతులను ఉద్దేశించి సీదిరి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో రైతులు దోపిడీకి గురవుతున్నాడన్నారు. కనీసం రైతులకు ఎరువులను కూడా పంపిణీ చేయలేని స్థితిలో ఉండడం దారుణమన్నారు. రైతులు పక్షాన పోరాటం చేస్తుంటే కూటమి ప్రభుత్వం ఆంక్షల పేరుతో నిర్బంధించడం దురదృష్టకరమన్నారు. అనంతరం పలాస ఆర్డిఓ కార్యాలయానికి పోలీసుల వాహనంలోనే డాక్టర్ అప్పలరాజుతోపాటు కీలక వైసిపి నేతలు చేరుకున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణ దాస్, జడ్పీ చైర్‌పర్సన్ పిరియ విజయ, జిల్లా పరిశీలకులు కుంభ రవి, ఎమ్మెల్సీ నర్తు రామారావు యాదవ్, మందస ఎంపీపీ డొక్కరి దానయ్య యాదవ్, వైఎస్ఆర్సిపి జిల్లా అధికార ప్రతినిధి బమ్మిడి దుర్యోధనరావు, వైయస్ఆర్సీపీ పలాస పట్టణ అధ్యక్షులు శిష్టు గోపి, వైఎస్ఆర్సిపి పలాస నియోజకవర్గ పరిశీలకులు దుంపల ప్రసాద్ మాస్టర్, వైఎస్ఆర్సిపి మందస మండల యువజన అధ్యక్షులు సేనాపతి కిషోర్, వైఎస్ఆర్సిపి జిల్లా యువజన ప్రధాన కార్యదర్శి మడియ రామకృష్ణ, బాలిగం పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు సొర్ర డిల్లేశ్వరరావు తదితరులు పలాస ఆర్డీవోను కలిసి రైతుల సమస్యలపై వినతిపత్రాన్ని అందజేశారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం



# ఎమ్మెల్యే గొండు అడుగులో అడుగు వేసిన.. స్త్రీ శక్తి

* సూర్యమహల్ జంక్షన్ నుంచి ఏడురోడ్ల కూడలి వరకూ భారీ ర్యాలీ
* స్త్రీశక్తి భారం కాదు.. బాధ్యత
* త్వరలో స్మార్ట్‌కార్డులు
* శ్రీకాకుళం మహిళలల్లో చైతన్యం ఎక్కువ
* మహిళల సంక్షేమమే కూటమి లక్ష్యం
* ప్రభుత్వ పథకాల్లోనూ మహిళలకే పెద్దపీట
* ఎమ్మెల్యే గొండు శంకరరావు
* చంద్రబాబు, మోదీ ఫ్లెక్సీలకు మహిళల క్షీరాభిషేకం
* పసుపుమయమైన నగరం

**శ్రీకాకుళం, సెప్టెంబర్ 9 (వార్త):** స్త్రీశక్తి.. శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అడుగులో అడుగులు వేస్తూ ముందుకుకదిలింది. జై చంద్రన్న, జై టీడీపీ నినాదాలతో శ్రీకాకుళం నగరం మార్మోగింది. మంగళవారం సూర్యమహల్ జంక్షన్ నుంచి ఏడు రోడ్ల కూడలి వరకూ మహిళలతో కలిసి ఎమ్మెల్యే భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ స్త్రీ శక్తి పథకం భారం కాదని.. బాధ్యతని అన్నారు. ఈ పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలు, ట్రాన్స్ జెండర్లకు త్వరలో స్మార్ట్ కార్డులను కూటమి ప్రభుత్వం అందజేస్తుందని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలన్నింటి కంటే 'స్త్రీశక్తి' పథకం వల్ల ఎక్కువ మంది లబ్ధి పొందుతున్నారన్నారు. మహిళల సహకారంతో స్త్రీశక్తి పథకం విజయవంతమైందని చెప్పారు. శ్రీకాకుళం జిల్లాలోని మహిళల్లో చైతన్యం ఎక్కువ అని ప్రభుత్వం ఎలాంటి పథకాలను తెచ్చినా.. వాటిని సద్వినియోగం చేసుకుంటారని తెలిపారు. ప్రభుత్వ పథకాలను అందిపుచ్చుకుని అభివృద్ధి చెందుతారని చెప్పారు. సీఎంగా ఉన్నప్పటి నుంచి చంద్రబాబునాయుడు మహిళలకు ప్రత్యేక పథకాలు ఇవ్వడానికి ఆసక్తి చూపించారని తెలిపారు. డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పిస్తే.. ఇప్పుడు నారీశక్తి ద్వారా వారికి ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించారని చెప్పారు. ఒకప్పుడు బాలికా విద్యను ప్రోత్సహించేందుకు సైకిళ్లు అందించారని, ఇప్పుడు విద్యార్థినులు, మహిళలందరికీ ఉచిత బస్సు ప్రయాణం కానుకగా ఇచ్చారన్నారు. మహిళలు బస్ పాసుల కోసం క్యూ లైన్లల్లో నిల్చొనే శ్రమ తప్పిందని, ఆర్టీసీ బస్సుల్లో వెళ్తే భద్రత కూడా ఉంటుందని తెలిపారు. స్త్రీశక్తి పథకాన్ని మహిళలు చాలా చక్కగా ఉపయోగించుకుంటున్నారని, అనవసర ప్రయాణాలు పెట్టుకోవడం లేదని తెలిపారు. రాష్ట్ర పరిస్థితిని అర్థం చేసుకుని, అందుకనుగుణంగా సహకరిస్తున్న మహిళలకు ధన్యవాదాలు చెప్పారు. ఆర్టీసీ సిబ్బందికీ ప్రయాణికులు సహకరించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలకు.. అభివృద్ధి కార్యక్రమాలకు ఇదే విధమైన సహకారం లభిస్తే మరింత ఉత్సాహంగా పని చేస్తామని, ప్రజలకు, మహిళలకు మరింత మేలు చేకూర్చగలమని చెప్పారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. అంతకుముందు మహిళలు వేదిక వద్ద ఉన్న చంద్రబాబు, మోదీ ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు.















## ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు సన్మానం

**సరుబుజ్జిలి, సెప్టెంబరు 9(వార్త):** గోనే పోడు జిల్లా పరిషత్ పాఠశాలలో పదవ తరగతిలో ప్రతిభ చాటిన విద్యార్థులను విద్య కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ మంగళవారం సన్మానించారు. ప్రతిభ కనబరిచిన వారికి ప్రోత్సాహకంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాగేశ్వరరావు, హెచ్‌ఎం దామోదర రావు ఉపాధ్యాయులు ఉన్నారు. అదేవిధంగా గోనెపోడు ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మంగళవారం ప్రధానోపాధ్యాయులు ఆధ్వర్యంలో సత్కరించారు.



# జీడి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

**మందస, సెప్టెంబరు 9(వార్త):** రాష్ట్ర ప్రభుత్వం మందస జీడి కార్మికులు సమస్యలు పరిష్కరించకపోతే పోరాటాన్ని ఉధృతం చేస్తామని సీఐటీయు నాయకులు, జీడి కార్మికసంఘ నాయకులు హెచ్చరించారు. శ్రీకాకుళంలోని ఆర్ అండ్ బి బంగ్లా నుండి కలెక్టర్ ఆఫీస్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన ధర్నానుద్దేశించి వక్తలు మాట్లాడుతూ జీడి కార్మికులకు పూర్తిస్థాయి పని దినాలు కల్పించాలని, కాల్చిన పిక్కలు అక్రమ తరలింపు ఆపాలని డిమాండ్ చేశారు. మందస జీడి యాజమాన్యాలు కాల్చిన పిక్కలను పరిశ్రమలో పనిచేసిన కార్మికులకు ఇవ్వకుండా అక్రమంగా వేరే ప్రాంతాలకు తరలిస్తుంటే ప్రభుత్వం యంత్రాంగం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. గత 26 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులకి పని ఇవ్వకుండా చట్ట వ్యతిరేకంగా లైసెన్సులు లేకుండాఇతర ప్రాంతాలకు తరలించి, అక్రమ పద్ధతిలో యాజమాన్యాలు వ్యవహరించడం చట్ట వ్యతిరేకమైన చర్యని వారు ధ్వజమెత్తారు. జీడి కార్మికులు అతి తక్కువ వేతనాలతో దుర్భరమైన జీవితాలు అనుభవిస్తున్నారని, కనీస వేతనాలు కానీ, పీఎఫ్, ఈఎస్ఐ, ఎనిమిది గంటల పని దినము, అదనపు పనికి అదనపు వేతనం మొదలు కార్మిక చట్టాలు అమలు చేయకుండా యాజమాన్యాలు కార్మిక చట్టాలు తుంగలో తొక్కి ప్రభుత్వం అండతో కార్మికులను తీవ్రంగా దోపిడీ చేస్తున్నాయని విమర్శించారు. చట్టాలు ఉల్లంగిస్తున్న యాజమాన్యాలపై ప్రభుత్వం యంత్రాంగం ఎందుకు చర్యలు తీసుకోవడం లేదో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. లైసెన్సు లేకుండా కాల్చిన పిక్కలను వేరే చోటికి ఏ విధంగా తరలిస్తారని వారు ప్రశ్నించారు. పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులకు పూర్తిస్థాయి పని కల్పించాలని పీఎఫ్, ఈఎస్ఐ అమలు చేయాలని. జీడి కార్మికులకు గ్లౌజులు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జీడి కార్మికుల పోరాటానికి సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు సంపూర్ణ మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయు జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, జిల్లా జీడి కార్మిక సంఘం నాయకులు అల్లు హేమలత, సీహెచ్ చంద్రమ్మ, సీహెచ్ జానకమ్మ, కె.శేశమ్మ, పి.సావిత్రి, జి.బాలమ్మ, కె.కుమారి, కె.శాంతమ్మ, కె. సరస్వతి, బి.భారతి, కె.ధనం, డి.లక్ష్మి, ఎం.దానమ్మ, డి.భారతమ్మ తదితరులతో పాటు జీడి కార్మికులు పాల్గొన్నారు.రైస్ మిల్లు కార్మిక సంఘం నాయకుడు కె.కేశవరావు జీడి కార్మికుల పోరాటానికి సంపూర్ణ మద్దతు తెలిపారు.




# యూరియా కోసం రైతుల పాట్లు



**జి.సిగడాం, సెప్టెంబరు 9(వార్త):** అరు గాలం శ్రమించే రైతులకు కూటమి పాలనలో అడుగడుగునా ఘోష తప్పడం లేదు. సాగు నీరు మొదలు విత్తనం, ఎరువు, గిట్టుబాటు ధర వరకు కన్నీరే మిగులుతుంది. పాలకుల నిర్లక్ష్యమో.. అధికారుల వైఫల్యమో తెలియదు గాని రైతులకు కనీసం అవగాహన లేకపోడం ఒక్కసారిగా యూరియా దొరకపోవడంతో రైతు సేవా కేంద్రాలు, ప్రవేటు ఎరువుల దుకాణల వద్ద రైతులు గగ్గోలు పెడుతూ అవేదన చెందు తున్నారు. జి.సిగడాం మండలం పెంట గ్రామంలో 1600 ఎకరాలకు 220 యురియా బస్తాలు చాలీ చాలనివిగా రావడంతో రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇలానే మండలంలో అన్ని రైతు సేవా కేంద్రాల్లో యూరియా కొరత కొరవడింది. యూరియాపై ప్రభుత్వం స్పందించి పంట పండించేందుకు ఎరువులను సకాలంలో అందజేయా లని రైతులు కోరుతున్నారు.

# ఏపీటీఎఫ్ నిరసన వారం విజయవంతం చేయాలి

**మందస, సెప్టెంబరు 9(వార్త):** ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా పిలుపునిచ్చిన నిరసన వారం కార్యక్రమాన్ని ఈ నెల 11నుండి 17వరకు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర కౌన్సిలర్ బల్ల సుభాష్ బాబు తెలిపారు. ఏపీటీఎఫ్ మందస మండల శాఖ ఆధ్వర్యంలో మందస మండలంలోని హరిపురం, అంబుగాం, లొహరిబంద, బహడపల్లి, బేతాళపురం, జీఆర్ పురం, కుంటికోట, పిడిమందస, వాసుదేవపురం, మధ్య, దేవుపురం, మహాదేవుపురం, కిల్లోయి, మందసలోని పలు పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయులు సమస్యలు సేకరిస్తూ, నిరసన కార్యక్రమం కరపత్రాలను పంచిపెట్టారు. ఉపాధ్యాయుల సమస్యలు పెండింగ్ డీఏ లు విడుదల, పీఆర్సీ కమీషన్ నియామకం, ఐఆర్ ప్రకటన, అన్ని మేనేజ్మెంట్ల సమస్యలు పరిష్కారానికై చేపడుతున్న నిరసన కార్యక్రమంలో భాగంగా 11న నల్ల బ్యాడ్జిలతో విధులకు హాజరు, 12న మండల స్థాయి ప్రదర్శనలు,13, 14వ తేదీల్లో ప్రజాప్రతినిధులకు వినతి పత్రాలు, 15న పాత తాలూకా కేంద్రాల్లో నిరసనలు, 16న జిల్లా కేంద్రాల్లో నిరసనలు, 17న వాట్సాప్, ఈ మెయిల్ ద్వారా సీఎస్, ముఖ్యమంత్రిలకు వినతులు పంపించే కార్యక్రమం చేపట్టమని, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. సభ్యత్వ నమోదు కూడా చేపట్టారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు గవ్వ భీమారావు, మండల అధ్యక్షుడు ఎస్.కిరణ్ కుమార్, కార్యవర్గ సభ్యులు కె.పాపారావు, డి.చంద్రశేఖర్, డి.వైకుంఠరావు, కె.జగదీశ్వర రావు, ఎన్.ఢిల్లేశ్వరరావు, కె.చిరంజీవి, ఎస్.నారాయణరావు, డి.దుర్గాప్రసాద్, ఎస్ కె హమీద్, టి.గంగారావు, ఆర్.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



# డాక్టర్ ప్రియాంకకు నాలుగు బంగారు పతకాలు



**పలాస, సెప్టెంబరు 9(వార్త):** ప్రముఖ వైద్యులు, సామాజిక వేత్త డాక్టర్ జీవితేశ్వరరావు కుమార్తె డాక్టర్ ప్రియాంకకు అండర్ గ్రాడ్యుయేషన్ ( ఎంబీబీఎస్) సమయంలో ఆమె చదువుల్లో వివిధ విభాగాలలో ప్రతిభకు గాను మంగళవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో ఏపీ గవర్నర్ సయిూద్ అబ్దుల్ నజీర్, మరియు ఏపీ హెల్త్ యూనివర్సిటీ వైస్ ఛాన్సెలర్ చేతుల మీదుగా నాలుగు ఏపీ హెల్త్ యూనివర్శిటీ బంగారు పతకాలు అందుకున్నారు. చిన్నప్పటి నుండి చదువులో ముందుండే డాక్టర్ ప్రియాంక 10వ తరగతి కాశీబుగ్గ శ్రీ చైతన్య, ఇంటర్ విజయవాడ శ్రీ చైతన్య లో చదువుకున్నారు. అనంతరం మెడికల్ ఎంట్రెన్స్ లో మెరుగైన ప్రతిభ చూపించడంతో ఆంధ్ర వైద్య కళాశాల, విశాఖపట్నంలో మెడిసిన్ చదువుకున్నారు. అనంతరం యునైటెడ్ స్టేట్స్ మెడికల్ లైసెన్సింగ్ ఎగ్జామినేషన్ లో మూడు విడతల మొదటి, రెండవ దశ పూర్తి చేసి మూడవ దశ పరీక్షలకు హాజరు కావలసివుందని, ఈ దశ పూర్తి చేసిన తరువాత వచ్చే సంవత్సరం అమెరికాలో పీజీ కోర్సులో జాయిన్ అవుతారని డాక్టర్ ప్రియాంక తండ్రి డాక్టర్ జీవితేశ్వరరావు తెలిపారు.



## బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

**జి.సిగడాం, సెప్టెంబరు 9(వార్త):** జి.సిగడాంలోని బాలాజీ కళ్యాణ మండ పంలో మంగళవారం బీజేపీ మండల కార్యకర్తలతో మండల బీజేపీ అధ్యక్షులు పైల విష్ణుమూర్తి ఆధ్యర్వంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోవు స్థానిక ఎన్నికలను ఎదుర్కోవడంపై బీజేపీని మండలంలో ప్రతి గ్రామానికి తీసుకెళ్లి బలోపేతం చేయాలనన్నారు. అలాగే మండలంలోని రెవెన్యూ సమస్యలపై దృష్టి సారించాలని కోరారు.కేంద్రంలో మోడీ చేసిన అభివృద్ధి కార్యక్రమాల గూర్చి వివరించారు. మండలంలో ప్రతి ఓటరును కలిసి నరేంద్ర మోదీ పథకాలను వివరించాలని ఆయన చెప్పారు. ఈ సమావేశంలో సీనియర్ నాయకులు బురాడ వెంకట రమణ, సర్పంచ్ సాకేటి నాగరాజు జిల్లా బీజేపీ కార్యదర్శి వర్జపర్తి రఘురాం, సర్పంచ్ ప్రతినిధి ముద్దాడ గౌరీశంకరరావు, నాయన సూరిరెడ్డి, ముద్దాడ త్రినాధ, సోంటేన శంకరరావు, గట్టెం అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు శిక్షణ



**మందస, సెప్టెంబరు 9(వార్త):**మందసలోని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సీడీపీఓ పెద్దింటి అరుణ ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పీఓ అరుణ అంగన్ వాడీ కార్యకర్తలనుద్దేశించి మాట్లాడుతూ 10రోజుల సంకల్పయాత్రలో భాగంగ పీఓసీస్ఓ చట్టం, మహిళలు పని చేసే చోట వారి యొక్క భద్రత, భేటి బచావో-భేటీ పడావో, మహిళలు, కిషోరీ బాలికల ఆరోగ్య భద్రత తదితర విషయాలపై శిక్షణ ఇచ్చారు. అదేవిధంగా అంగన్ వాడీ కేంద్రాల సమయపాలన, వారు పని చేస్తున్న మొబైల్ అప్లికేషన్ లపై మరోసారి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీడీపీఓ అరుణతో పాటు సెక్టార్ సూపర్ వైజర్లు సీహెచ్.వి.రామలక్ష్మి, పి.జయలక్ష్మి, జె.లక్ష్మి పాల్గొన్నారు.

## సంకల్పంపై విద్యార్థులకు అవగాహన



**జలుమూరు,సెప్టెంబరు 9(వార్త):** అంగన్వాడి కేంద్రం అధ్వర్యంలో వారం రోజుల పాటు సంకల్ప అనే అంశం పై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని ఐసిడిఎస్ సూపర్వైజర్ సీతారత్నం తెలిపారు. మంగళవారం జలుమురు జూనియర్ కళాశాల లో పది అంశాలు పై అవగాహన కల్పించారు. పరిశుభ్రత పైన, భద్రత, పిల్లలకు చేతులు శుభ్రత, ప్రాథమిక భద్రత, పౌష్టిక ఆహారం మరియు నైపుణ్య అభివృద్ధి పైనా అవగాహన కలిప్చదం జరిగింది అని సూపర్వైజర్ సీతారత్నం తేలిపారు. కార్యక్రమంలో అంగన్వాడి కార్యకర్త మాలతి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలత, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు

## యూరియా వాడకంపై అవగాహన

**సరుబుజ్జిలి, సెప్టెంబరు 9(వార్త):** సింధువాడ సచివాలయన్ని మంగళవారం డి.ఆర్.డి.ఏ. పి.డి. కిరణ్ కుమార్ సందర్శించారు. సచివాలయం సిబ్బందికి యూరియా వాడకం పై అవగాహన కల్పించారు. గ్రామాల్లో రైతులకు పూర్తి స్థాయిలో యూరియా వాడకం పై అవగాహన కల్పించాలని, మోతాదుకు మించి ఉపయోగించటం వలన కలిగే దుష్ప్రభావాల ను రైతులుకు తెలియపరిచాలని, అనవసరపు కొరత కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సచివాలయం సిబ్బందికి తెలిపారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## మూగ బాలికపై అత్యాచారం అమానవీయం



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 9(వార్త):** సీతమ్మధారలో ఒక మూగ బాలికపై జరిగిన దారుణమైన అత్యాచారం మన సమాజాన్ని సిగ్గుతో తలదించుకునేలా చేసిందని, జిల్లా వైస్సార్సీపీ మహిళా అధ్యక్షురాలు, మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉళాల భారతీ దివ్య తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బాధ్యులను వెంటనే పట్టుకుని, ఫాస్ట్ ట్రాక్ కోర్టులో కేసు నడిపి, కఠినమైన శిక్షలు విధించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.బాధిత బాలిక కుటుంబానికి తక్షణమే ఆర్థిక సహాయం, మానసిక మద్దతు ఇవ్వాలని,భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సమాజంలో స్త్రీల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని,మహిళలపై దాడులు, బాలికలపై దాడులు అంటే అది సమాజం మొత్తం మీద దాడిఅని,ఇలాంటి ఘోర నేరాలు మళ్లీ జరగకుండా మనందరం ఒక్కటై నిలబడాలని అన్నారు.



## అంగనవాడీలు బాధ్యతగా విధులు నిర్వర్తించాలి

**సారవకోట, సెప్టెంబరు 9(వార్త):** గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న అంగనవాడి కార్యకర్తలు బాధ్యతగా తమ విధులను నిర్వర్తించాలని సారవకోట ప్రాజెక్ట్ అధికారిని సిహెచ్ వంశీ ప్రియ అన్నారు. మంగళవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రత్యక్ష సమీక్ష సమావేశంలో పాల్గొని పలుసూచనలు ఇచ్చారు. పౌష్టికాహారం అందరికీ అంది ఇలా చూడాలని పిల్లలు కేంద్రానికి వచ్చి వెళ్లే సమయాల్లో బాధ్యత మనదేనని ఆమె అన్నారు సమావేశంలో పర్యవేక్షణ అధికారులు పాల్గొన్నారు.

## రెండు ఆర్వోబీలకు టెండర్లు ఖరారు



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 9(వార్త):** రైల్వేస్టేషన్ పరిధిలో ఇచ్ఛాపురం – సుర్ల రోడ్ స్టేషన్ ల మధ్య ఉత్తరవైపు రత్తకన్న ఎల్సి గేటు 626/02 వద్ద రూ.2.60 కోట్లతో రైల్వే రోడ్ అండర్ బ్రిడ్జి కి ఇచ్ఛాపురం -జాడుపుడి రైల్వేస్టేషన్ ల మధ్య పాతాళీశ్వర ఆలయం కి వెళ్లే దారిలో 627/36-38 దక్షిణ వైపు రూ 3.19 కోట్లతో అంచనా విలువలకి రెండు రైల్వే రోడ్ అండర్ బ్రిడ్జిల టెండర్ లు ఖరారు అయినట్లు జెడ్ అర్ యు సి సి సభ్యులు శ్రీనివాస్ రంగా రౌలో తెలిపారు. విశాఖపట్నానికి చెందిన. వి. శ్రీనివాస్ కాంటాక్టర్ టెండర్ లు దక్కించుకున్నారని, అగ్రిమెంట్ పొంది పనులు త్వరలో ప్రారంభించుతారనితెలియజేసారు. ఈ రైల్వే రోడ్డు అండర్ బ్రిడ్జిలు మంజూరుకు కృషిచేసిన కేంద్ర మంత్రి కె రామ్మోహన్ నాయుడు కి, మరియు ఎమ్మెల్యే బి అశోక్ బాబు కి కృతజ్ఞతలు తెలియజేశారు.

## రైతులందరికీ యూరియా అందాలి



**నరసన్నపేట, సెప్టెంబరు 9(వార్త):** నరసన్నపేట నియోజకవర్గ పరిధిలో రైతులందరికీ సక్రంగా యూరియా అందించేలా ఈ కూటమి ప్రభుత్వం కృషి చేయాలని నరసన్నపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ మామిడి సత్యనారాయణ అన్నారు. యూరియా కోసం రైతులు పడుతున్న బాధలు ఇన్ని అన్ని కావని ఈ ప్రభుత్వం నిర్లక్ష్యంతో చాలామంది రైతులు అన్యాయాలకు గురవుతున్నారని ఆయన అన్నారు ఇప్పటికైనా ప్రభుత్వం పరిశీలించి న్యాయం చేయాలని కోరారు.

## ఎస్జీఎఫ్ మండల స్థాయి ఎంపికలు

**పలాస, సెప్టెంబరు 9(వార్త):** పాఠశాల క్రీడల సమాఖ్య (ఎస్ జీ ఎఫ్) ఆధ్వర్యంలో అండర్ – 14, 17 విభాగాలలో పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈనెల 10, 11 తేదీలలో మండలస్థాయి ఎంపికలు జరగనున్నాయని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.రవికుమార్, జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు పి.తవిటయ్య సంయుక్త ప్రకటనలో తెలిపారు. 10న కబడ్డీ, యోగ, బ్యాడ్మింటన్, 11న వాలీబాల్, ఖోఖో, చదరంగం అంశాలలో మధ్యాహ్నం 1గంటకు ఈ ఎంపికలు ఉంటాయని ఆయన వివరించారు.

## బెల్లుపడలో ఎరువుల పంపిణీ

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 9(వార్త):** బెల్లుపడ రైతు సేవా కేంద్రంలో ఎరువుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండల రెవెన్యూ అధికారి వెంకట రావు , మున్సిపల్ చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి లు హాజరై రైతులకు ఎరువుల సంచులు అందజేశారు.మొత్తం 89 మంది రైతులకు 152 సంచులు కూపన్ల ద్వారా పారదర్శకంగా పంపిణీ చేసారు. రైతులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎరువులు పొందేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశామని వ్యవసాయ అధికారి అజయ్ కుమార్ చెప్పారు.ఈ కార్యక్రమంలో అధికారులు రైతులకు ఎరువుల సరైన వినియోగంపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా యూరియా అధిక వినియోగం వలన భూమి సారం తగ్గిపోతుందని, సమతుల్య ఎరువుల వాడకం ద్వారానే పంటల దిగుబడి పెరుగుతుందని వివరించారు.మండల వ్యవసాయ అధికారి, గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతు సంఘాల ప్రతినిధులు కూడా పాల్గొన్నారు.



# ఆందోళన వద్దు.. రైతులకు అండగా ఉంటాం

**మందస, సెప్టెంబరు 9(వార్త):** రైతులు అనవసరమైన ఆందోళన చెందవద్దని, అవసరమైన యూరియా అందుబాటులో ఉందని ఎరువులు రైతులకు సక్రమంగా అందాలని సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరక్టర్, పలాస నియోజకవర్గ ప్రత్యేకాధికారి డి.మధుసూదనరావు, మండల ప్రత్యేకాధికారి డాక్టర్ సీహెచ్ నరసింహులు అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గల సమావేశ మందిరంలో ఎరువుల సరఫరాపై ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ లో వరి సాగు చేస్తున్న రైతాంగం యూరియా లభ్యతపై, ప్రతీ ఒక్కరికి అందేలా చూస్తామన్నారు. ఈ నెల 10నుంచి గ్రామాల్లో సర్వే నిర్వహించి, రైతులలో అవగాహన కల్పించాలన్నారు. రైతులకు శాస్త్రీయ పద్ధతిలో ఎరువులు ఉపయోగించేలా రైతులకు సూచనలను చేయాలన్నారు. ఒక ఎకరా వరి పొలానికి 25కిలోల యూరియా ఒక మోతాదులో వేయడానికి సరిపోతుందని అవగాహన కల్పించాలన్నారు. మూడు పర్యాయాలు ఎకరాకు 75కిలోలు చొప్పున రైతులందరికీ విడతలు వారిగా రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ప్రైవేటు డీలర్లు ద్వారా స్థానిక సచివాలయంలోని వ్యవసాయ సిబ్బందితో రైతులు అందరికీ కూపన్లు ఇచ్చి సరిపడా



యూరియా అందించే ప్రణాళికతో రైతుల వద్దకు వస్తున్నామన్నారు. రైతులు అర్థం చేసుకుని ప్రభుత్వానికి సహకరించాలని కోరారు. అధిక మొత్తం యూరియా వాడకం వల్ల వస్తున్న అనర్థాలను కూడా రైతులు అర్థం చేసుకుని సేంద్రీయ పద్దతిలో పచ్చిరొట్ట ఎరువులు, వర్మీ కంపోస్ట్, అజోలా, వేపపిండి తయారు చేసుకుని ఉపయోగించు కోవడంతో పంట దిగుబడి, అధిక ప్రయోజనం కూడా ఉంటుందని అవగాహన కల్పించాలన్నారు. ఎరువుల కొరతలేదని, ప్రభుత్వం అందిస్తున్న ఎరువులు రైతులకు సక్రమంగా చేరడానికి అధికార యంత్రాంగం చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా కల్తీ ఎరువులు, కృత్రిమ కొరత వాటిపై కూడా నిఘా వేయాలన్నారు. సమావేశము జరిపి కీలక సూచనలు ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ మిస్క శ్రీకాంత్, వ్యవసాయాధికారి జి.నాగరాజు, ఐసీడీఎస్ సీడీపీఓ పెద్దింటి అరుణ, మందస ఎస్ఐ కె. క్రిష్ణప్రసాద్, ఏఓ బి.ఋషేశ్వరరావు, పంచాయతీ సెక్రటరీలు, విలేజ్ అగ్రికల్చరల్, హార్టికల్చరల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## యూరియాపై వినియోగంపై రైతులకు అవగాహన

**మందస, సెప్టెంబరు 9(వార్త):** యూరియాపై వినియోగంపై ఐటీడీఏ వెలుగు అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మందస మండలంలోని అంబుగాం సచివాలయంలో గల రైతు సేవా కేంద్రంలో రైతులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా వరి సాగు విస్తీర్ణంకు శాస్త్రీయ పద్ధతిలో ఉపయోగించడానికి సరిపడా యూరియా నిల్వలు మన జిల్లాలోనే నిల్వ ఉన్నట్లు జిల్లా అధికార యంత్రాంగం సూచనలను అర్థం చేసుకోవాలని వివరించారు. ఒక ఎకరా వరి పొలానికి 25కిలోలు యూరియా ఒక మోతాదులో వేయడానికి సరిపోతుందని అవగాహన కల్పించారు. మూడు పర్యాయాలు ఎకరాకు 75కిలోలు చొప్పున రైతులందరికీ విడతలు వారిగా రైతు సేవా కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ప్రైవేటు డీలర్లు ద్వారా స్థానిక సచివాలయం రెవిన్యూ, అగ్రికల్చర్ అసిస్టెంట్ ల సహకారంతో రైతులు అందరికీ కూపన్ లను ఇచ్చి సరిపడా యూరియా అందించే ప్రణాళికతో జిల్లా యంత్రాంగం ఉందన్నారు. రైతులు ఏమైనా సమస్యలు ఉంటే 9121863788 అనే టోల్ ఫ్రీ నెంబర్ కు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్ద మండల లచ్చయ్య, వి.ఓ.ఏ.లు చంద్రమ్మ, మహాలక్ష్మి, క్లస్టర్ కోఆర్డినేటర్లు మంగమ్మ, ముఖలింగం, విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్ రూప, వి.ఆర్.ఓ. ఉషారాణితో పాటు సచివాలయ సిబ్బంది రైతులు, మహిళలు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

**నరసన్నపేట, సెప్టెంబరు 9(వార్త):**నరసన్నపేట నియోజకవర్గం మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఉద్యోగులు వారి సమస్యలను ఈ రోజు ఉదయం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ బలగ ప్రవీణ్ కుమార్ కి లిఖిత పూర్వకంగా సమర్పించారు. మొత్తం 15 సమస్యలను వారు ఆయనకు వివరించారు. ప్రవీణ్ కుమార్ పంచాయతీరాజ్ శాఖ మంత్రివర్యులు శ్రీ కొణిదెల పవన్ కళ్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి వారి సమస్యలకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తాను అని హామీ ఇచ్చారు. ఉపాధి హామీ ఉద్యోగులకు %ూ=జ% 23% అమలు, జీతములు పెంపుదలచేయుట, గ్రేడ్ ఫిక్సేషన్, జీతములు పెంపుదలలో వ్యత్యాసములు సరిచేయుట, ఇంక్రిమెంట్లు సవరించమని కోరుట డెత్ క్లెయిమ్ 10 లక్షలకు పెంచుట గురించి ఇలా మొత్తం



15 సమస్యలను వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ఏపీవోలు, టీఏలు, సీవోలు, ఇతర ఉద్యోగులు, జనసేన నాయకులు వరుదు రామ్ శేఖర్, లండ నారాయణ, జనసైనికులు పాల్గొన్నారు.

# గంజాయి కేసులో నిందితులకు జైలుశిక్ష, జరిమానా




**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 9(వార్త):** గంజాయి కేసులో ముగ్గురు నిందితులకు 10 సంవత్సరాలు కఠిన కారాగార జైలు శిక్ష తోపాటు ఒక్కొక్కరికి ఒక లక్ష రూపాయలు జరిమాన విధిస్తూ శ్రీకాకుళం ఒకటవ అదనపు జిల్లా సెషన్స్ కోర్ట్ (స్పెషల్ ఎన్డిపిఎస్ కోర్టు)జడ్జి పి. భాస్కరరావు తీర్పును వెల్లడించినట్లు సి ఐ ఎం చిన్నం నాయుడు ఒక ప్రకటన ద్వారా తెలిపారు.సదురు జరిమానాలు ఒక లక్ష రూపాయలు కట్టని యెడల ఆరు నెలలు సాధారణ సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పులో వెల్లడించినట్లు తెలిపారు. 2022సం.లో ఘనశ్యం బెహరా రేయి త్రినాథం , పైలా వాసు , అను ముగ్గురు నిందితులు నిషేదిత గంజాయి అమ్ముతూ అక్రమ లాభార్జన పొందుతున్నారని ఇందులో భాగంగా టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని 2022 నవంబర్ 19 న పురుషోత్తపురం గ్రామము శ్మశాన వాటిక వద్దకి నిందితుడు అయిన ఘనశ్యామ్ బేహార ఒడిషా రాష్ట్రం కొండ ప్రాంతమయిన అడవ ప్రాంత రైతుల వద్ద గంజాయి ని కొని తన మోటార్ సైకిల్ పై తీసుకువచ్చి రెయ్యి త్రినాధం మరియు పైల వాసుకి 33 కిలోలు ఎండిన గంజాయిని మూడు గోనె సంచులలో తీసుకు వచ్చి అమ్ముతుండగా అప్పటి టౌన్ యస్. ఐ. కూన గోవిందరావు గారికి పట్టుబడినారు. సదరు గంజాయి విలువ రూ.99,000/-. అప్పుడు వారి వద్ద నుండి 33 కేజీల గంజాయి, మోటార్ సైకిల్ మరియు మూడు సెల్ ఫోన్ లు స్వాధీన పరుచుకుని, కేసు నమోదు చేసి అరెస్టు చేసి రిమాండ్ నకు తరలించారు.ఈ కేసులో మధ్యవర్తులు గా రెవిన్యూ సిబ్బంది వ్యవహరించగా కేసు నమోదు అనంతరం అప్పటి ఇచ్ఛాపురం సర్కిల్ ఇన్స్పెక్టర్లు సతీష్ కుమార్, ఈశ్వర్ ప్రసాద్ కేసును దర్యాప్తు చేపట్టాగ, కేసు ఛార్జ్ షీట్ అనంతరం జిల్లా ఒకటవ అదనపు సెషన్స్ జిల్లా జడ్జి కోర్టులో కేసు విచారణ సమయంలో ఫస్ట్ క్లాస్ ఏ డి జె కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.శ్రీనివాసరావు కేసును వాదించారు. పై కేసులో ముద్దాయిలకు శిక్ష పడటంలో ప్రతిభ కనబరిచిన అప్పటి టౌన్ పోలీసు స్టేషన్ ఎస్సై కె.గోవిందరావు ముగ్గురు నిందితులను అరెస్టు చేయడం తోపాటు, కేసు నమోదు అనంతరం సమగ్రమైన దర్యాప్తు చేసిన సీఐలు సతీష్ కుమార్, ఈశ్వర్ ప్రసాద్ కేసు ఛార్జ్ షీట్ వేసిన అనంతరం కేసు విచారణ సమయంలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కె.శ్రీనివాసరావు వాదన, సహకరించిన సిఎంఎస్ లైజన్ ఆఫీసర్ హెడ్ కానిస్టేబుల్ గోవిందరావులను జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి ప్రత్యేకంగా అభినందించి ప్రశంసించారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## దాసరి తాతారావుకు రాష్ట్ర డైరెక్టర్ పదవి



**మందస, సెప్టెంబరు 9(వార్త):** తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు దాసరి తాతారావు ఆంధ్రప్రదేశ్ బ్యాక్ వర్డ్ క్లాసెస్ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పోరేషన్ రాష్ట్ర డైరక్టర్గా నియమితులయ్యారు. లొహరిబంద పంచాయతీ గొల్లలపాలెం గ్రామానికి చెందిన దాసరి తాతారావు మంచి విద్యావంతుడు. అంకితభావం కలిగిన నాయకుడు. దాసరి కుటుంబం తెలుగుదేశం పార్టీకి అందిస్తున్న సేవలకు ప్రతిఫలంగా తాతారావు సతీమణి జయలక్ష్మికి మందస ఎంపీపీ పదవి కూడా పార్టీ కట్టబెట్టింది. ప్రస్తుతం ఆయన జిల్లా అధికార ప్రతినిధిగా కీలక బాధ్యతలు నిర్వహిస్తున్నారు.మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, మాజీ మంత్రి గౌతు శ్యామసుందరశివాజీ, ఎంఎల్ఏ గౌతు శిరీషా, పలాస నియోజకవర్గం ఇన్చార్జి వెంకన్నచౌదరిలకు తాతారావు కృతజ్ఞతలుతెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకానికి అనుగుణంగా పని చేస్తానని పేర్కొన్నారు.

## ఆదివాసీలను అంతమొందించే కుట్ర 'ఆపరేషన్ కగార్'



**పలాస, సెప్టెంబరు 9(వార్త):**ఆదివాసీలను అంతమొందించే కుట్రలో భాగమే 'ఆపరేషన్ కగార్ అని శ్రీకాకుళం సిపిఐ (యం.యల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాష్ అన్నారు. సెప్టెంబర్ 10న చిన్న గంతర్ లో కామ్రేడ్ కుమార్ అన్న వర్ధంతి వేడుకలు జయప్రదం చేయాలని మంగళవారం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పదకొండేళ్లలో హిందుత్వీకరణ, కార్పొరేటీకరణ, సైనికీకరణ పెరిగినట్లుగానే వాటికి వ్యతిరేకంగా కూడా ప్రజా పోరాటాలూ ఉధృతమయ్యాయి. అనేక కొత్త పోరాట రూపాలను కార్పొరేటీకరణ అనివార్యం చేసింది. సారాంశంలో కార్పొరేట్ హిందుత్వ మతోన్మాదాన్ని, ఫాసిజాన్ని అంగీకరించబోమని భారత ప్రజలు ఎలుగెత్తి చాటారు. దారుణమైన నిర్బంధం, అణచివేత, దోపిడీ, హత్యాకాండలు ఎంత చెలరేగినా ప్రతిఘటిస్తామని ప్రజలు నిరూపించారు. ప్రజా క్షేత్రమే ఫాసిజాన్ని, కార్పొరేటీకరణను ఎప్పటికైనా తుదముట్టించగలదని గత పోరాట చరిత్ర తేల్చిచెప్పింది. మన చుట్టూ ఉన్న ఆశా నిరాశల ప్రపంచం తప్పక ఆశావహంగానే మారుతుందనే భరోసా కూడా ఇన్నేళ్ల విషాదం అందించింది. జీవన రంగాలన్నిట్లో మరింత సృజనాత్మకంగా, మిలిటెంట్‌గా, విశాల ప్రాతిపదిక మీద పోరాటాలను ఎట్లా నిర్మించాలి? వాటన్నిటినీ ఎట్లా సమన్వయం చేయాలి? తెలిసిగాని, తెలియకగాని ఫాసిజానికి లోబడిన పీడిత ప్రజలందరినీ ఎట్లా బైటికి తీసుకురావాలి? ఫాసిజానికి ఉన్న సమ్మతిని ఎట్లా బద్దలు కొట్టాలి? అనే లోతైన ప్రశ్నలు మరోసారి సంధించుకోవాల్సిన సమయం ఇదని అన్నారు. దేశం ఒక కొత్త దశలోకి ప్రయాణిస్తున్నదని, కార్పొరేట్ హిందూ దేశాన్ని స్థాపించాలనే కుట్రలో భాగంగానే విప్లవ చైతన్యాన్ని తుడిచేయాలనీ, పీడిత అస్తిత్వ ప్రజలను విముక్తి దిశగా నడిపించే, కార్పొరేటీకరణను సమరశీలంగా ఎదుర్కొనే విప్లవోద్యమాన్ని పూర్తిగా దెబ్బతీయాలనీ, మధ్యభారత దేశంలో కార్పొరేటీకరణను, సైనికీకరణను శక్తివంతంగా ఎదుర్కొంటున్న ఆదివాసులను చంపేయాలనే దుర్మార్గపు కుట్రలో భాగంగానే 'ఆపరేషన్ కగార్ 'అనే అంతిమ యుద్ధాన్ని పాలకులు నేడు నడుపుతున్నారు. గత ఏడాది జనవరి 1వ తేదీ నుంచి కగార్ పేరిట ఇప్పటికి వందలాది మందిని చంపేశారు. ఇందులో సాధారణ ఆదివాసులే ఎక్కువగా ఉన్నారు. అందులో విప్లవకారులూ ఉన్నారు. మధ్యభారత దేశంలో ఆదివాసుల హత్యాకాండ మరింత తీవ్రమైంది. రాజ్యాంగ విలువలను, విధానాలను ఖాతరు చేయకుండా కేంద్ర ప్రభుత్వం ఆదివాసుల మీద యుద్ధానికి తెగబడిందని ఉన్నారు.

ఈ కార్యక్రమంలో వామపక్ష నేతలు వంకర మాధవరావు, పోతనపల్లి కుసుమ, మద్దిల రామారావు, పత్రిరి దానేష్ తదితరులు పాల్గొన్నారు.



## నూతన అంబులెన్స్‌ను ప్రారంభించిన వజ్జ

**పలాస, సెప్టెంబరు 9(వార్త):** ఆపదలో ఉన్నవారికి సంజీవినిల ఆదుకునేందుకు అత్యాధునిక వసతులు కలిగిన నూతన 108 అంబులెన్స్ వాహనాన్ని కాశీబుగ్గలో మంగళవారం ఎమ్మెల్యే గౌతు శిరిష సూచనల మేరకు ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబురావు పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం పేదవాడికి వైద్య, విద్య సేవలు అందించడంలో ప్రత్యేక దృష్టి పెట్టిందని అన్నారు. ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అవసరమైనప్పుడు అంబులెన్స్?? సేవలు వినియోగమౌతాయని తెలిపారు. ప్రజల సౌకర్యార్థం అంబులెన్స్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అంబులెన్స్?? సౌకర్యాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు బడ్డా నాగరాజు, లోడగల కామేష్, సప్ప నవీన్, గురుటి సూర్యనారాయణ, పైల చక్రధర రావుతో పాటు టిడిపి నాయకులు, 108 జోనల్ మేనేజర్ బాలరాజు, డి ఎం నవీన్, చిన్న బాబు, రంగా ప్రసాద్, సత్యం తోపాటు పలాస డివిజన్ 108 సిబ్బంది పాల్గొన్నారు.

## జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునికి అలయన్స్ క్లబ్ అభినందన



**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 9(వార్త):** ఈదుపురం మండల పరిషత్ మోడల్ ప్రైమరీ పాఠశాల కు చెందిన కంబాల చంద్రశేఖర్ రెడ్డి కి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ చేతులమీదుగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా అవార్డు అందుకున్న శుభ సందర్భం గా అలయన్స్ క్లబ్ స్థానిక సురంగి రాజా మైదానం లో అభినందన సభ ఏర్పాటు చేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు జి. ఉమాశంకర్ పర్యవేక్షణ లో జరిగిన కార్యక్రమం లో అధ్యక్షులు లోపింటి నరసింహ మూర్తి, ఉపాధ్యాయులు ఎల్.వెంకట్రావ్, జాడు ప్రకాష్ ఉమాశంకర్, రిటైర్డ్ ఆర్మీ అధికారి దక్కత సుమన్, ఎస్. బి. ఐ ఉద్యోగి, గౌరీ శంకర్. పి. ఆర్. ఓ దక్కత గోపి, బత్తుల వెంకటరమణ, బాలకృష్ణ, యోగి, కాళ్ళ నరసింహ,మురళి, చాట్ల లోహిదాస్, రవి, బుజ్జి, రమణ, రఘు పి. లోహిదాస్ వాకర్స్ తదితరులు పాల్గొన్నారు.

## రహదారులపై జంగిల్ క్లియరెన్స్



**పలాస, సెప్టెంబరు 9(వార్త):** పలాస నియోజకవర్గం లక్ష్మీపురం ప్రాదేశికం పరిధిలో రోడ్డు మార్గంనకు ఇరువైపుల పిచ్చిమొక్కలు పెరిగిపోయి వాహన దారులులకు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకుని స్థానిక కూటమి నాయకుడు శ్రీశైన సాధికారిక కమిటీ మెంబర్ కృష్ణం రాజు సొంత నిధులతో పరిసరాలు జంగిల్ క్లియరెన్స్ మంగళవారం చేయడం జరిదింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రహదారులపై పిచ్చి మొక్కలు ఉండడంతో వాహన చోదుకులు ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకొని సొంత నిధులు జింగిల్ క్లియరెన్స్ చేపట్టడం జరిగిందని చెప్పారు.

## సమాచార శాఖ డీడీగా లోచర్ల రమేష్



**వీరఘట్టం, సెప్టెంబరు 9(వార్త):** పార్వతీపురం మన్యం జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి, సహాయ సంచాలకులు లోచర్ల రమేష్ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ)గా పదోన్నతి పొందారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గత నెలలో జరిగిన శాఖాపరమైన పదోన్నతుల కమిటీ (డీపీసీ)లో రాష్ట్ర వ్యాప్తంగా ఆరుగురు ఏడీలకు – పి. వెంకటరాజు గౌడ్, పి భాస్కర నారాయణ, ఎం వేలాయుధం, పి వేణుగోపాల్ రెడ్డి, డి .రమేష్, లోచర్ల రమేష్ కు పదోన్నతి కల్పించారు. రమేష్ కు డిప్యూటీ డైరెక్టర్ గా పదోన్నతి రావటంపై సమాచార పౌర సంబంధాల శాఖ అధికారులు, సిబ్బంది, సన్నిహితులు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. 1996 సంవత్సరంలో ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ద్వారా సహాయ పౌర సంబంధాల అధికారిగా ఎంపికై హైదరాబాద్, విశాఖపట్నం, పాడేరు, టెక్కలి, పార్వతీపురం, శ్రీకాకుళం లలో వివిధ హోదాల్లో పనిచేశారు. డిప్యూటీ డైరెక్టర్ గా పదోన్నతి కల్పించి గుంటూరు జిల్లాకు నియమిస్తూ సమాచార శాఖ సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు.

## జేసీఐ వారోత్సవాలు ప్రారంభం




**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 9(వార్త):** జెసిఐ ఇచ్ఛాపురం ఆధ్వర్యంలో జెసిఐ వీక్ 2025 కార్యక్రమాలు జెసిఐ జెండా ఆవిష్కరణతో అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. జెసిఐ సభ్యులు మరియు స్థానిక ప్రజల సమక్షంలో నిర్వహించిన ఈ కార్యక్రమం లో ప్రారంభోత్సవానికి జెసిఐ ఇచ్ఛాపురం అధ్యక్షులు కాళ్ల జైదేవ్, జెసిఐ వీక్ చైర్మన్ డాక్టర్ వెచ్చా వాసవి, సెక్రటరీ టీ. మోహన్ వెంకటేశ్ నాయకత్వం వహించారు.జోన్ అధికారులు షన్ముఖ్, స్వరూప్ , సభ్యులు వెచ్చా రాము, శ్రీనివాస్ మట్ట, స్నిగ్ధ, శ్రావ్య, అనిత్, గౌరిజీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## డీజేలను అరికట్టండి

**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 9(వార్త):** ఈదుపురంలో మహతి సాంస్కృతిక కళాసేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ప్రస్తుత సమాజంలో ఉత్సవాలలో నిర్వహిస్తున్న ఊరేగింపు మండపాల వద్ద డిజెలను అరికట్టాలని, పిల్లలకు వృద్ధులకు యుక్త వయసు ఉన్నవారికి గుండె సంబంధిత హార్ట్ ఎటాక్ వంటివి సంభవిస్తున్న తరుణంలో వీటిని అరికట్టాలని కోరింది. కార్యక్రమంలో మహతి సాంస్కృతిక కళాసేవా సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి తిప్పన ధనుంజయ రెడ్డి, అధ్యక్షులు రంగాల జానకిరామ్ రెడ్డి, ఉపాధ్యక్షులు నర్తు గంగయ్య, ప్రచార కార్యదర్శి చలపరాయి వినోద్‌కుమార్, కోశాధికారి కొప్పల హేమంత్, సలహాదారులు బోర రామారావు, గుజ్జు కూర్మారావు, ఆచారి, బాలరాజు పాల్గొన్నారు.



# వైస్సార్సీపీ నేతల హౌస్ అరెస్టు





**ఇచ్ఛాపురం, సెప్టెంబరు 9(వార్త):** వైస్సార్సీపీ రాష్ట్ర నాయకత్వం పిలుపు మేరకు పలాస అర్ డి వో కార్యాలయం ఎదుట నిర్వహించిన అన్నదాతపోరుబాట కార్యక్రమంలో పాల్గొన్న కుండా వైస్సార్సీపీ నేతలు ను పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. కె శాసనం లో ఎంపీపీ బోర పుష్ప, మాజీ ఎంపిపి కరింగి మోహన్ రావు,కరింగి త్రినాధ్ రెడ్డి, ఉద్ధవ్ బేహారా లను అదుపులోకి తీసుకున్నారు. బెల్లు పద లో మున్సిపల్ చైర్ పర్సన్ పిలక రాజ్యలక్ష్మి,సుగ్గ ప్రేమ్ కుమార్, చాట్ల తిరుపతి, పరపటి కోటి, సాలీనా మోహన్ గాంధీ,పిలక సంతు లను హౌస్ అరెస్ట్ చేశారు. మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ ఉళాల భారతీ దివ్య ను కారు లో వెళు ండగాఅడ్డుకున్నారు.అనంతరం తహసీల్దార్ వెంకట రావు కి యూరియా సరిపడా సరఫరా చేయాలని వినతిపత్రం అందజేశారు. బెల్లు పద రైతు సేవా కేంద్రం వద్ద ఎరువులు కోసం రైతులు బారులు తీరారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546